హైదరాబాద్ వార్త

మున్సిపల్ జోష్..

-"గ్రేటర్" ఎన్నికలపై సర్కారు ఫోకస్..
-మూడు కార్పొరేషన్లకు నిర్వహించేలా చర్యలు
-తొలుత సిఎంసి, ఎంఎంసిల వార్డులను పునర్విభజన
-తర్వాత రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టే యోచన
-మే చివరి నాటికి పాలకమండలి కొలువు దీరేలా చర్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త: ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించటంతో అదే జోష్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించేందుకు సర్కారు సిద్ధమైనట్లు తెలుస్తుంది. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ లోని 27 పట్టణ స్థానిక సంస్థల విలీనం, ఆ తర్వాత పెరిగిన పరిధి పునర్విభజన, జీహెచ్ఎంసీ, సిఎంసి, ఎంఎంసిలుగా ఏర్పడిన సంగతి తెలిసిందే..అయితే ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధించడంతో ఆదేజోష్‌లో మూడు కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేలా సర్కారు కసరత్తు చేస్తుంది. ఎన్నికల నిర్వహించేందుకు తొలుత సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ లోని మొత్తం 150 వార్డులను పునర్విభజించాలని కూడా భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఈరెండు కార్పొరేషన్లలోని వార్డుల సంఖ్యను 200 కు పరిమితం చేసేలా వార్డుల పునర్విభజన చేపట్టాలని అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. ఆతర్వాత వార్డులు, మేయర్, డిప్యూటీ మేయర్ల సీట్లకు రిజర్వేష న్ల ప్రక్రియ చేపట్టి తర్వాత ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. శంషా బాద్ వరకు 150 వార్డులతో విస్తరించి ఉన్న జీహె చ్ఎంసీ మేయర్ సీటును ఇటీవలే మహిళా జనరల్ గా రిజర్వు చేసినప్పటికీ, ఇప్పుడు మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు కావటం, జీహెచ్ఎంసీ పరిధిలోని కొత్తగా పట్టణ స్థానిక సంస్థలు విలీనమైన విషయాన్ని పరిగణలోకి తీసుకుని రిజర్వేషన్లను ఖరారు చేసే దిశగా కసరత్తు మొదలైనట్లు తెలిసింది.

మే చివరినాటికి ప్రక్రియ పూర్తి..

మేనెల చివరి కల్లా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, పాలక మండలిలను కొలువుదీరేలా కసరత్తును వేగవంతం చేయాలని సర్కారు అధికారులను ఆదేశించినట్లు తెలుస్తుంది. పదిశాతం మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటైన జీహెచ్ఎంసీ మినహా మిగిలిన సైబరాబాద్, మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్లలోని మొత్తం 150 మున్సిపల్ వార్డులను 45 వేల జనాభా కటాఫ్‌గా పది శాతం మైనస్‌గా గానీ, పది శాతం ప్లస్ గా గానీ పునర్విభజన చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఉన్న మున్సిపల్ వార్డులను కూడా ఇటీవలే 45 వేల జనాభా కటాఫ్‌గా పునర్విభజించినా, కొన్ని వార్డుల్లో కనిష్టంగా 30 వేల జనాభా, గరిష్టంగా 70 వేల నుంచి 80 వేల జనాభాతో కూడా వార్డులను ఏర్పాటు చేసినట్లు అప్పట్లో ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇపుడు కూడా 76 మున్సిపల్ వార్డులతో సైబరాబాద్, మరో 74 వార్డులతో మల్కాజ్ గిరి మున్సి పల్ కార్పొరేషన్లు ఏర్పాటైన సం గతి తెల్సిందే. మరోసారి పునర్వి భజన చేపట్టి, సరిగ్గా 45 వేల జనాభాకు నాలుగు న్నర వేల జనాభా ఎక్కువ గానీ, నాలుగున్నర వేల జనాభా తక్కువతో గానీ పునర్విభజించాలని భావి స్తున్నట్లు తెలిసింది.

ఒకే చోటవచ్చేలా చర్యలు..

అలాగే ఒక్కో వార్డు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి రాకుండా, ఒక్కో వార్డు రెండు మున్సిపల్ సర్కిల్స్, జోన్ల పరిధిలోకి రాకుండా జాగ్రత్తలు వహిస్తూ పునర్విభజ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఈ ప్రక్రియ అంతా కూడా ఏప్రిల్ నెలాఖరు వరకు సిద్ధం చేయాలని ప్రభుత్వ పెద్దలు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికలతో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో అనుకూలమైన ఆదరణ ఉందని గ్రహించిన సర్కారు తదుపరిజీహెచ్ ఎంసీ లోని మూడు మేయర్ల సీట్లను కైవసం చేసుకునే దిశగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తుంది.

వైభవంగా కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

-స్వామి వారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు -నేడు శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు

యాగశాలలో హోమాలు చేస్తున్న వేద పండితులు

గర్భాలయంలోని శివలింగానికి అభిషేకం చేస్తున్న వేద పండితులు

హైదరాబాద్,కీసర,ఫిబ్రవరి14,ప్రభాతవార్త: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వస్వామి సన్నిధిలో రుద్రస్వాహకార హోమాలు వైభవంగా జరిగాయి. స్వామివారి ప్రధాన ఆలయానికి ప్రక్కన ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పండితులు గణపతి శర్మ ఆధ్వర్యంలో రుద్ర హోమం,వేద పారాయణం చేశారు.ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బిల్వార్చన ,ప్రదోషకాల పూజ, హరతి, మంత్రపుష్పం, పరాకస్తవం,తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు వైభవపేతంగా నిర్వహించారు.ఒకప్పుడు కీసరగుట్ట ప్రాంతంలో మును,రుషులు హోమాలు జరిపినట్లు పురాణగాథలో ఉందని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు హోమాలు నిర్వహిస్తున్నట్లు వేదపండితులు మార్తి సత్యనారాయణ మూర్తి,గణపతి శర్మలు తెలిపారు.లోక క్షేమం కోసం తితిదే వేద పాఠశాల విద్యార్థులతో యాగశాలలో హోమాలు వేదపారాయణం చేస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేటి పూజల వివరాలు : తెల్లవారు జామున 4 గంటల నుండి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం,ఉదయం 6 గంటల నుండి సామూహిక అభిషేకములు (కళ్యాణ మండపంలో),ఉదయం 9 గంటలకు రుద్రస్వామకార హోమం,రాత్రి 8 గంటలకు నందివాహన సేవ,రాత్రి 10 గంటలకు భజనలు,అర్ధరాత్రి 12 గంటల నుండి శ్రీ రామలింగేశ్వస్వామి వారికి సంతత ధారాభిషేకం (లింగోద్భవకాలములో) తదితర పూజలు నిర్వహించనున్నారు.

16 నుంచి సిఎంసిలో ప్రజావాణి : కమిషనర్ సృజన

హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పౌరుల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 16 వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి సృజన తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. మాదాపూర్ న్యాక్ బిల్డింగ్ సీఎంసి కార్యాలయం మొదటి అంతస్తులోనీ మీటింగ్ హాల్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 01.00 వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 16 వ తేదీన ప్రారంభించే ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.పౌరుల నుంచి నేరుగా ఫిర్యాదులు

కమిషనర్ జి.సృజన

స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. మౌలిక వసతులు, పారిశుద్ధం, డ్రైనేజ్, వీధి దీపాలు, నిర్మాణ అనుమతులు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బొకేలు, శాలువాలు వద్దు...

సైబరాబాద్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన జి. సృజన తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలు బొకేలు, షాల్లు, మిఠాయిలు, బహుమతులు తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. బహుమతులపై ఖర్చు చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

వ్యర్థాల తొలగింపు పద్ధతులు మెరుగుపడాలి

-ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త వ్యర్థాల తొలగింపు పనులను సమర్థవంతంగా అమలు చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మన్సూరాబాద్, ఆటోనగర్ లోని డంపింగ్ యార్డ్‌ను కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా వ్యర్థాల నిర్వహణ కార్యకలాపాల ప్రస్తుత స్థితిని సమీక్షించి, సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాల తొలగింపు పద్ధతులను సమర్థవంతంగా అమలు చేయడం, మెరుగుపరచాల్సిన ప్రాంతాలను గుర్తించడం ఈ సందర్శన లక్ష్యమన్నారు. నాగోల్ సర్కిల్, సౌతెండ్ పార్క్ కాలనీలో నిర్మాణంలో ఉన్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను ఆరా తీశారు. చేపడుతున్న పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసి డిప్యూటీ కమిషనర్ (సర్కిల్ నెం 11) రవీందర్ రెడ్డి, సిఇ అశోక్‌రెడ్డి,ఇఇలు,డిఇఇలుఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో డంపింగ్ యార్డును సందర్శించిన ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఎంఎంసిలో ప్రతి సోమవారం 'ప్రజావాణి'

నూతనంగా ఆవిర్భవించి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి)లో ఇక ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నారు.ఈ మేరకు ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంతో పాటు ఎంఎంసి పరిధిలోని అన్ని సర్కిల్ కార్యాలయాలు, జోనల్ కార్యాలయాల్లో జరిగే ప్రజావాణి కార్యక్రమాల్లో అధికారులు పాల్గొనాలని కోరారు. అధికారులందరూ ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

తార్నాకల్లోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో తనతో పాటు అన్ని విభాగాల విభాగాధిపతులు పాల్గొంటారని తెలిపారు. పౌరులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడాని, ఆ సమస్యల పరిష్కారానికి ఇదొక మంచి అవకాశమని, ప్రజా వాణిని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు.

జీతాలు లేక... మానసిక ఒత్తిడితో మదర్ డెయిరీ ఉద్యోగి మృతి

మృతదేహంతో గేటు ముందు కూర్చున్న కుటుంబ సభ్యులు

హయత్ నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : రెండు నెలలకు పైగా వేతనాలు అందక మానసికంగా ఒత్తిడికి గురై మదర్ డెయిరీ ఉద్యోగి కుప్పకూలి మృతిచెందిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు.... పసుమాముల గ్రామానికి చెందిన తులసిగారి బాలనర్సింహ హయత్ నగర్లోని విజయనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆయన మదర్ డెయిరీ లోని ప్రీప్యాక్ సెక్షన్ లో ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. మదర్ డెయిరీ నష్టాల కారణంగా ఉద్యోగులకు రెండున్నర నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. కుటుంబ ఖర్చులు, ఇతరత్ర ఒత్తిడి కారణంగా మానసికంగా క్రుంగిపోసాగాడు. ఈ క్రమంలో శుక్రవారం విధులలో ఉండగానే రాత్రి 8 గంటల సమయంలో కుప్పకూలి పడిపోయాడు. తోటి సిబ్బంది 108 అంబులెన్స్ కు ఫోన్ చేసి వనస్థలిపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడినుండి మలక్పేట లోని యశోద ఆసుపత్రికి తరలించారు. తలలో రక్తం కారుతోందని ఆపరేషన్ కు 1015 లక్షలు ఖర్చు అవుతుందని అక్కడి ఆసుపత్రి వర్గాలు చెప్పడంతో బాలనర్సింహను గాంధి ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం 9 గంటల సమయంలో చికిత్స కొనసాగు తుండగానే అతను మృతి చెందాడు. గేటు ముందు మృతదేహంతో ఆందోళమదర్ డెయిరీ యజమాన్యం వైఖరి కారణంగానే బాలనర్సింహ మృతి చెందాడని సంస్థ పరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు గేటుముందు మృతదేహంతో ఆందోళనకు దిగారు. వేతనాలు సకాలంలో ఇచ్చి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని గేటు లోపలికి వెళ్లేందుకు యత్నించారు. ఇన్స్ పెక్టర్ నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు వారిని అడ్డు కున్నారు. పసుమముల మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ లు ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి తో ఫోన్ మాట్లాడారు. తాను అందుబాటులో లేనని... సోమవారం బోర్డు సమావేశములో చర్చించి పరిహారం అందచేస్తానని కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ నిచ్చారు. తక్షణ సహాయంగా ఇంచార్జి ఎండీ లింగా రెడ్డి 50వేల రూపాయలను మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. దీంతో వారు ఆందోళనను విరమించారు.

కొలిక్కి వచ్చిన హెచ్‌సియు ల్యాప్‌టాప్ చోరీ కేసు

చోరీలో విద్యార్థుల పాత్ర...?

గచ్చిబౌలి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో లక్షల రూపాయల విలువైన ల్యాప్ టాప్‌ల చోరీ కేసు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తుంది. ల్యాప్‌టాప్‌లను చోరీ చేసిన నిందితులను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసినట్లు విశ్వసనీయ సమాచారం అందుతుంది. కాగా ల్యాప్‌టాప్‌ల చోరీలో విద్యార్థుల పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించడం సంచలనంగా మారింది. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సిఆర్ రావు ఇనిస్టిట్యూట్‌లో గత ఐదురోజుల క్రితం 60ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయ్యాయి. అంతకు రెండు రోజుల క్రితమే తెచ్చిన ల్యాప్‌టాప్‌లను కిటికీ గ్రిల్స్ తొలగించి దుండగులు చోరీ చేశారు. చోరీకి గురైన ల్యాప్‌టాప్‌ల విలువ లక్షల విలువ ఉంటుందని వర్సిటీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు వర్సిటీ వర్గాల పిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసిన ల్యాప్‌టాప్‌లతో దుండగులు ఓ మారుతీ బెలానో కారులో ప్రధాన గేటు ద్వారా బయటకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. కారు నెంబరు ఆధారంగా కేసును చేధించిన పోలీసులు చోరీలో పాల్గొన్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. కాగా చోరీ చేసిన ల్యాప్‌టాప్‌లను బెంగళూరుకు తరలించినట్లు గుర్తించిన పోలీసులు వాటిని రికవరీ చేసే పనిలో ఉన్నారు. కాగా ఈ చోరీలో సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థుల పాత్ర ఉన్నట్లు పోలీసులకు ఆధారాలు లభించడం సంచలనంగా మారింది. కాగా హెచ్‌సియు ల్యాప్‌టాప్ చోరీ కేసుపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్ బాలరాజు తెలిపారు.

జిహెచ్ఎంసిని సందర్శించిన ట్రైనీ ఐపిఎస్‌లు

ట్రైనీ ఐఏఎస్‌లతో కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: ఐఏఎస్ ప్రొఫెషనల్ కోర్సు శీతాకాల స్టడీ టూర్‌లో భాగంగా 2025 బ్యాచ్‌కు చెందిన దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ శిక్షణార్థులు శనివారం జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌ను కలిసి తమను పరిచయం చేసుకున్నారు. అనంతరం జీహెచ్ఎంసీ పనితీరు, బాధ్యతలు, పాలనా వ్యవస్థపై కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. జీహెచ్ఎంసీ నిర్మాణం, చట్టబద్ధ విధులు, నగర పరిపాలనలో ఎదురయ్యే సవాళ్లు, విధానాల అమలు వంటి అంశాలను ట్రైనీ ఐఏఎస్ లకు కమిషనర్ వివరించారు. వేగంగా విస్తరిస్తున్న మహానగరంలో పౌర సేవలను సమర్థంగా అందించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంజినీరింగ్, మౌలిక వసతుల అభివృద్ధి పనులు, టిడిఆర్ విధానం అమలు, సంక్షేమ పథకాలు, ఐటీ ఆధారిత సేవలు వంటి ప్రాధాన్య రంగాలపై ప్రత్యేకంగా వివరించారు. భవన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి పారదర్శకత పెంచే బిల్డ్‌నౌ యాప్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. పరిపాలన విస్తృతి, సమస్యలు, సవాళ్లను వివరించిన కమిషనర్ సమగ్ర ప్రణాళిక, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ, సాంకేతిక వినియోగం ద్వారా సేవలను మెరుగుపరుస్తున్నామని తెలి పారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్‌లు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్లు,జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు ట్రైనీలతో తమ అనుభవాలను పంచుకున్నారు.

17న ఇందిరాపార్క్ వద్ద గీత కార్మికుల నిరాహార దీక్ష

వివరాలు వెల్లడిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణ

చిక్కడపల్లి ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే 2026 -27 బడ్జెట్ లో గీత కార్మికుల సంక్షేమానికి రూ. 5000 కోట్లు కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17వ తేదీన ఇందిరా పార్క్ వద్ద నిరాహారదీక్ష చేస్తున్నామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం.వి. రమణ పిలుపునిచ్చారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో గీత కార్మికులకు ప్రతిసారి అన్యాయమే జరుగుతుందన్నారు. 5 వేల కోట్లు కేటాయించి గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్షలో గీత కార్మికులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకటనర్సయ్య ,రాష్ట్ర కమిటీ సభ్యులు యం.కృష్ణస్వామి గౌడ్, సురుగు రాజేష్ గౌడ్ మరియు సుదగాని రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

కుషాయిగూడలో పోకిరీల ఆగడాలు

-సైరన్ వేసుకుని రోడ్డుపై హంగామా
-ఓవ్యక్తిని ఢీకొట్టి ఈడ్చుకెళ్ళిన బొలోరో వాహనం
-ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

హైదరాబాద్, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త: రాజధాని నగరంలో పోకిరీల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. సైరన్లు వేసుకుంటూ రోడ్లపై హంగామా సృష్టించడమే కాకుండా, ప్రశ్నించిన వారిని ప్రాణాలతోనే ఈడ్చుకెళ్లే స్థాయికి వీరి ఉన్మాదం చేరింది. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో తాజాగా చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఒక సామాన్య ప్రైవేట్ ఉద్యోగిని బొలెరో కారుతో ఢీకొట్టి, కిలోమీటరు దూరం ఈడ్చుకెళ్లి, అతని ప్రాణాలను గాలిలో కలిపే ప్రయత్నం చేశారు కొందరు యువకులు.బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్ అనే వ్యక్తి ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. విధి నిర్వహణ ముగించుకుని రాత్రి సమయంలో తన కారులో ఇంటికి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో ఒక బొలెరో కారులో ఉన్న కొందరు యువకులు కారుకు సైరన్ వేసుకుంటూ, అతివేగంతో రోడ్డుపై హంగామా సృష్టించారు. సతీష్ కారును బొలెరోతో బలంగా ఢీకొట్టిన ఆ యువకులు, కనీసం ఆపకుండా వేగంగా వెళ్లిపోయే ప్రయత్నం చేశారు. దీంతో సతీష్ వారిని వెంబడించి కొంత దూరం వెళ్ళాక ఆపగలిగాడు. కారు దిగి దుండగుల బొలెరోకు ఎదురుగా నిల్చుని, ఎందుకు ఢీకొట్టారని ప్రశ్నిం చే ప్రయత్నం చేశాడు. అయితే, ఏమాత్రం కనికరం లేని ఆ యువకులు కారును సతీష్ వైపు వేగంగా పోనిచ్చారు. కారు వేగంగా రావడంతో సతీష్ కిందపడిపోయి, ప్రాణ రక్షణ కోసం బొలెరో ముందున్న బంపన్ను గట్టిగా పట్టుకున్నాడు. కారు కింద మనిషి ఉన్నాడని తెలిసినా, ఆ పోకిరీలు కనికరించలేదు. సుమారు 700 మీటర్ల నుండి ఒక కిలోమీటరు వరకు అలాగే ఈడ్చుకెళ్లారు. ఆ భయంకరమైన రాపిడికి సతీష్ వీపు భాగం అంతా రోడ్డుకు గీసుకుపోయి తీవ్రంగా దెబ్బతింది. నొప్పి భరించలేక సతీష్ బంపర్ వదిలేయగా, ఆ కారు అతనిపై నుంచే దూసుకెళ్లిపోయింది.కారు కింద పడి ఈడ్చుకెళ్లడం వల్ల సతీష్ ప్రైవేట్ పార్ట్స్ పూర్తిగా డ్యామేజ్ అయ్యాయి. కాలు విరగడంతో పాటు వీపు భాగం మొత్తం చెక్కుకుపోయింది. ప్రస్తుతం సతీష్ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ ఘటన జరిగి ఇంత దారుణం జరిగినా పోలీసులు నిందితుల వివరాలను వెల్లడించకపోవడంపై సతీష్ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ పౌరుల కారుకు పోలీసుల లాంటి సైరన్ ఎలా ఉంది? ఆ కారులో ఉన్న యువకులు ఎవరు? వారు మద్యం లేదా గంజాయి మత్తులో ఉన్నారా? నిందితుల వెనుక ఎవరైనా రాజకీయ పలుకుబడి ఉన్నవారు ఉన్నారా? అందుకే పోలీసులు వివరాలు దాస్తున్నారా? అని బాధిత కుటుంబం ప్రశ్నిస్తోంది.

బన్సీలాల్ పెట్ మెట్ల బావి వద్ద , పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన సిఆర్‌పిఎఫ్ అమరవీరులకు శ్రద్ధంజలి ఘటిస్తున్న ఆర్మీ జవానులు

సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగిస్తాం

సమ్మెలో పాల్గొన్న రిగ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని గ్రేటర్ హైదరాబాద్ రిగ్ ఓనర్స్ అసోసియేషన్ వారు పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రిగ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ నుండి నిరవధికంగా సమ్మె జరుగుతుందని వారు స్పష్టం చేశారు. బోర్లు వేస్తున్న సమయంలో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఎంతో మంది నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా స్పేర్ పార్ట్స్ రేట్లు గాని, పైపులు, బిట్స్, హామర్స్, డీజిల్, ఆయిల్, లేబర్ ధరలు పెరగడం వల్ల నిరవధిక సమ్మె జరుగుతున్నట్లు తెలియజేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రిగ్స్ మొత్తము ఆరున్నర నాలుగున్నర రోబోలను మొత్తం నిలిపివేసినట్లు తెలియజేశారు. ఈ విషయాన్ని వినియోగదారులు, కంపెనీవారు గ్రహించి తమకు సహకారం అందించాలని మనవి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ముసుకు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి నర్సిరెడ్డి, కోశాధికారి మోహన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, సభ్యులు డి నరసింహ ముదిరాజ్, విష్ణువర్ధన్ రెడ్డి, అనిల్ కుమార్, కమలాకర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, రాము, శ్రీనివాసరావు, రవీందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, సిద్ధిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు,

పోగొట్టుకున్న ఫోన్లను అప్పగించిన పోలీసులు

మొబైల్‌ఫోన్లను అప్పగిస్తున్న ఏసీపీ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ గోపిలు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త : ప్రయాణం, మార్కెట్, షాపింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు పొగొట్టుకున్న బాధితులు సంబంధిత ఫోన్ సిమ్, ఐఎంఈ నెంబర్లను పోలీసులకు తెలియజేయాలని చాంద్రాయణగుట్ట ఏసీపీ ఎ.సుధాకర్ కోరారు. ఆ నెంబర్లను సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ) పోర్టల్ నమోదు చేసి రికవరీ చేస్తామన్నారు. చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 32 మొబైల్ ఫోన్లను ఇన్‌స్పెక్టర్ గోపి, డీఐ రామస్వామిలతో కలిసి శనివారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ఫోన్లలో ఉన్న గుగూల్ పే, ఫోన్ పేలు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్ పోయిన వెంటనే సంబంధిత సర్వీసు ప్రొవైడర్లకు ఫోన్ చేసి సిమ్‌ను బ్లాక్ చేయించుకోవాలని సూచించారు. పోయిన ఫోన్ల రికవరీ కోసం ప్రతి పోలీసుస్టేషన్లో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 32 ఫోన్లను రికవరీ చేసిన క్రైమ్ టీమ్‌ను అభినందించారు. క్రైమ్ టీమ్‌కు రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు వెల్లడించారు. కాగ తమ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

చెట్ల కొమ్మలను తొలగించిన జిహెచ్ఎంసి సిబ్బంది

ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

బేగంపేట ఫిబ్రవరి 14,ప్రభాతవార్త

బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో శనివారం విద్యుత్ తీగలకు అంతరాయంగా ఉన్న చెట్ల కొమ్మలను జీహెచ్ఎంసీ సిబ్బంది కొట్టివేసారు. సనత్‌నగర్ నియోజకవర్గం ఇంచార్జి కోట నీలిమ ఆదేశాల మేరకు శనివారం ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ రోడ్డులో అంతరాయంగా ఉన్న కొమ్మలను కొట్టివేసారు. హైమాస్ట్ లైట్లకు కూడా చెట్లకొమ్మలు అంతరాయంగా మారడంతో బస్తీకి చెందిన వారు ఈ విషయాన్ని కోట నీలిమ దృష్టికి తీసికెళ్లడంతో కొమ్మలు కొట్టివేసారు. ఈ కార్యక్రమంలో మునీర్‌ఖాన్, నసీరుద్దీన్ (అడ్డా) ఉన్నారు.

నీతి,నిజాయితీ,స్వయం కృషితో ఎదిగిన దామోదరం

-మాజీ గవర్నర్ బండారు దత్తాత్తేయ



దామోదరం సంజీవయ్యకు నివాళులు అర్పిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్తేయ.

బేగంపేట ఫిబ్రవరి 14,ప్రభాతవార్త

నీతి,నిజాయితీ,స్వయం కృషితో అత్యున్నత స్థానానికి ఎదిగిన వ్యక్తి దామోదరం సంజీవయ్య అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్తేయ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,కార్మిక పక్షపాతి దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కులో ఆయన చిత్ర పటం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దత్తాత్తేయ మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించి స్వయం కృషితో ప్రజాసేవా తత్పరతతో ఆయన ఎంతో ఎత్తుకు ఎదిగారని కొనియాడారు. చిన్న వయసులోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి సామాజిక న్యాయం ,భూసంస్కరణలు ,వెనుక బడిన వర్గాల అభివృద్ధికి విశేష కృషి చేసారని ,కేంద్ర కార్మిక శాఖామంత్రిగా కార్మికుల అభ్యున్నతికి నిరంతరం ఆయన కృషి చేసారని అన్నారు. దామోదరం సంజీవయ్య ఆశయాలు,విలువలు ఎల్లప్పుడు మనకు మార్గదర్శకంగా నిలవాలని కోరుకుంటున్నానని అన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు. చిత్రంలో వలువురు కాంగ్రెస్ నేతలు

ప్రపంచంతో పోటీపడే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

-ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మనచుట్టూ ఉన్నవారితో కాకుండా ప్రపంచంతో పోటీ పడే విజ్ఞానాన్ని సంపాదించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బి. బాలకిష్టారెడ్డి అన్నారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్, ఏపీ మాజీ మంత్రి ఎం.శ్రీనివాస్‌రావు అధ్యక్షతన శనివారం కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్లో అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో జరిగిన హెచ్ఎర్ కాంక్లేవ్ 2028 సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మనచుట్టూ ఉన్నవారితో కాకుండా ప్రపంచంతో పోటీపడే విజ్ఞానాన్ని సంపాదించాలని, అప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాదిస్తుందన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశంగా కాకుండా అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని, 2047 సంవత్సరం వరకు 30 ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించాలని ప్రధాని మోదీ చెప్పారని, ఆ దిశగా నేటి యువత కృషి చేయాలని సూచించారు. మనల్ని టెక్నాలజీ కంట్రోల్ చేయకుండా మనమే టెక్నాలజీని కంట్రోల్ చేసే స్థాయిలో ఉండాలని సూచించారు. ప్రతిభావంతులకు అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అవంతి కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ యం.ప్రియాంక, టెక్ మహేంద్ర ఇండియా గ్రోత్ హెడ్ చల్లా వివేకానంద, ఇన్ఫోసిస్ టెక్నికల్ స్పీకర్ డాక్టర్ సర్వేపల్లి కళ్యాణ్, హెచ్డిఎఫ్సి రీజినల్ మేనేజర్ రామ్ కిషోర్, విప్రో టాలెంట్ ఆక్వజేషన్ అసోసియేట్ డైరెక్టర్ సేవురి నరేష్ అంతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అప్పారావు, హెచ్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద, వైస్ ప్రెసిడెంట్ ఎంవిఎస్ఎస్. నందేష్, డాక్టర్ రాకేష్, హెచ్ఎర్ అలీమొద్దీన్, తదితరులు పాల్గొన్నారు

అవంతి విద్యాసంస్థ నిర్వహించిన హెచ్ఆర్ కాంక్లేవ్ సదస్సు ప్రారంభిస్తున్న సంస్థ చైర్మన్, మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తదితరులు

అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపిన సనాతన హిందూ ధర్మ సేన ప్రతినిధులు

నిజాంపేట్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

సనాతన ధర్మ హిందూ పరిరక్షణలో భాగంగా హిందూ కళాక్షేత్రం, గ్రేవి యార్డ్, ధార్మిక కార్యక్రమాలకు కేటాయించిన స్థలంలో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని అక్రమ కట్టడాలు నిర్మించే క్రమంలో భాగంగానే అక్కడ కావాలని కొంతమంది చేత చెత్త డంపును స్టోరేజ్ చేస్తున్నారని శనివారం స్థానిక ఎమ్మార్వోని కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకోవడం జరిగిందని ఆ స్థల పరిరక్షణలో భాగంగా సనాతన హిందూ ధర్మ పరిరక్షణ ప్రతినిధుల బృందం ఆ స్థలంలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా సనాతన హిందూ పరిరక్షణ సమితి బృంద సభ్యుడు బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ దాదాపు 2022 నుండి హిందువుల తరఫున పోరాడుతూ పలు మార్లు స్థానిక ఎమ్మార్వోకి జిల్లా కలెక్టర్‌కి వివిధ ప్రతినిధులకు పలుమార్లు వివిధ వినతి పత్రాలు సమర్పించగా సర్వేనెంబర్ 186లో 2025లో హిందువుల కోసం 1.5 ఎకరాల స్థలం కేటాయించి స్థానిక ఎమ్మార్వో సూచనలు మేరకు ఆర్ఐ సర్వేయర్ హద్దులను చూపించడం జరిగిందన్నారు. కానీ తాము పట్టు వదలకుండా 2023లో ఆర్డీవో పంచనామా ప్రకారం న్యాయబద్ధంగా హిందువులకు రావలసిన 3.20 ఎకరాలు కేటాయించాలని పలు మార్లు స్థానిక ఎమ్మార్వోకి కలెక్టర్‌ని కలవడం జరిగిందన్నారు. నూతనంగా వచ్చిన బాచుపల్లి ఎమ్మార్వో వాణి రెడ్డి ఆదేశాల మేరకు 186లో రీ సర్వే చేయడం ద్వారా హిందువులకు కేటాయించిన ఒకటిన్నర ఎకరాల స్థలాన్ని రెండు ఎకరాలుగా మారుస్తూ ఉత్తర్వులు జారి చేయడం జరిగిందని, తమ యొక్క అభ్యర్థన మన్నించి రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించడాన్ని జిహెచ్ఎంసి నిజాంపేట సర్కిల్ హిందూ ప్రజల తరఫున జిల్లా కలెక్టర్‌కి, ముఖ్యంగా స్థానిక ఎమ్మార్వో వాణి రెడ్డికి, సర్వేయర్‌కి ఆర్ఐకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఈ ప్రయాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మాకు మద్దతు తెలియజేసి వివిధ సహాయ సహకారాలు అందించిన అందిస్తున్న అన్ని పార్టీలలోని ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ హిందూ కల్చర్ ఎలా అసోసియేషన్ సభ్యులైన బిక్షపతి యాదవ్ నరేంద్ర చౌదరి, ప్రసాద్ రాజు, సచిన్, నారాయణమూర్తి, శివ, సతీష్ కృష్ణ, సాయి కృష్ణారెడ్డి, అశోక్ నాయక్, నరేష్, భూపాల్ రెడ్డి, వేణు, కిషన్, విష్ణు, ఇతర హిందూ ప్రతినిధులు పాల్గొన్నారు

నేత్రపర్వంగా శ్రీసంగమేశ్వరస్వామివారి మహాశివరాత్రి సప్తదశ వార్షిక బ్రహ్మోత్సవాలు

నాంపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలోని ఎస్‌బిహెచ్ కాలనీ గాంధీనగర్‌లోవున్న అతిపురాతన శ్రీసంగమేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామివార్ల దేవాలయంలో శనివారం ఉదయం 8.30ల నుండి యాగశాల ప్రవేశం, సోమకుంభ స్థాపన, అగ్నిప్రతిష్ట, గణపతి హోమం, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమములు, ధ్వజాది హోమం, ధ్వజారోహణంలతో శ్రీ సంగమేశ్వరస్వామి వారి మహాశివరాత్రి, సప్తదశ వార్షిక బ్రహోత్సవాలు నేత్రపర్వంగా ఆరంభమై రాత్రి 7 నుండి భేరిపూజ, భేరి తాండవం, నిత్యహోమం, నిత్య పూర్ణాహుతి, బలిహరణం, నివేదనలు శాస్త్రోక్తంగా జరిగాయి. ముందుగా శుక్రవారం సాయంత్రం 5.30గంటల నుండి గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, మృత్యంగ్రహణం, అంకురారోపణ, అఖండ దీపారాధాన, వాస్తుపూజ, వాస్తు హోమం, ధ్వజపటాధివాసము కన్నులపండువ చేశాయి. ఈ నెల 16 వరకు ఆలయ సంప్రదాయానుసారం జరుగుతున్న ఈ ఉత్సవాల్లో నిత్యహోమం, మహాన్యాసపూర్వక ఏకాదశ, ఏకవార రుద్రాభిషేకాధి ప్రత్యేక పూజలతోపాటు ఆదివారం మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఉదయం 4గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకము, 7.30 నుండి రాత్రి 9గంటల వరకు ఏకవార రుద్రాభిషేకములు, అర్చనలు, ఉదయం 9లకు రుద్రహోమం, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమం, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, నివేదన, రాత్రి 7లకు నిత్యహోమం, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, రాద్రి 8.30లకు శివకళ్యాణ మహోత్సవం, రాత్రి 11గంటల నుండి లింగోద్భవకాలంలో మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, అనంతరం రథోత్సవము అర్చకస్వాముల వేదమంత్రోచ్చారణలతో భక్తజన సందోహ హరహర మహదేవ... శంభోశంకర శివనామస్మరణతో జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి, ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ తదితర అర్చకులు తెలిపారు.

ధ్వజారోహణం, సప్తదశ వార్షిక బ్రహ్మోత్సవాలతో ఆరంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు

రంజాన్ మాసంలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు : డిఈ శ్రీధర్

చార్మినార్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : రంజాన్ మాసంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండ ముందు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకున్నామని టిజిఎస్పిడిసిఎల్ చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్ అన్నారు. ప్రజలు విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు చేస్తే క్షేత్ర స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. మక్కామసీదు ఆవరణలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమత్తుల పనులను ఆయన చార్మినార్ ఏడిఈ సయ్యద్ మక్సూద్, చార్మినార్ సిబిడి ఏడిఈ మహ్మద్ అక్బర్, హుస్సేనీఆలం ఏఈ రాములతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చార్మినార్ డివిజనల్ ఇంజనీరు ఎం.శ్రీధర్ మాట్లాడుతూ కొద్ది రోజులలో రంజాన్ మాసం ప్రారంభం కానున్నదని,ప్రజలకు రంజాన్‌లో మాసంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండ ముందు జాగ్రత్తగా అన్ని ఏర్పాట్లు చేయటం జరిగిందని తెలిపారు. చారిత్రక మక్కామసీదువద్ద నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పని చేస్తున్నాయని, ఈ నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు అదనంగా 315కెవి సామర్థ్యం గల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు. అదే విధంగా లోడ్ డివైడ్ కోసం ఎలెట్ సర్క్యూట్ నెల కొల్పామని, మక్కామసీదుతో పాటు పాత నగరంలోని అన్ని మసీదులు వద్ద విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లు చేశామని డిఈ శ్రీధర్ వెల్లడించారు. మక్కామసీదు వద్ద రంజాన్ మాసంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండ చార్మినార్ ఎడిఈ సయ్యద్ మక్సూద్ పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది ఉంటారని ఆయన తెలిపారు. అదే విధంగా కార్పొరేటర్ సంస్థ 15 మంది తాత్కాలిక సిబ్బందిని పంపించిందని ,వీరితో పాటు పాతబస్తీలోని ఎఫ్ఓఐ సిబ్బంది కూడ అందుబాటులో ఉంటారని ఎటువంటి విద్యుత్ సమస్యలు కలగకుండ అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో చార్మినార్ ఏడిఈ సయ్యద్ మక్సూద్, చార్మినార్ సిబిడి ఏడిఈ మహ్మద్ అక్బర్, హుస్సేనీఆలం ఏఈ రాములువిద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మక్కామసీదు వద్ద విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పనులను పరిశీలిస్తున్న చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దిన ఘనత పవన్ వినయ్ కుమార్‌దే

తాజా మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త) :

గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ గా గత ఐదేళ్లుగా అహర్నిశలు శ్రమిస్తూ, డివిజన్‌ను అభివృద్ధి పథంలో అగ్ర స్థానంలో నిలిపిన పావని వినయ్ కుమార్ తమ పదవీ కాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం అభినందన సత్కార కార్యక్రమం భారతీయ జనతా యువమోర్చ, బీజేపీ, మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ తో పాటు తాజా మాజీ కార్పొరేటర్ లను సత్కరించారు. డివిజన్ ప్రజల సంక్షేమం కోసం, మౌలిక సదుపాయాల కల్పన కోసం పావని చేసిన కృషి చిరస్మరణీయమని, వారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని నేతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పుల్వామా దాడిని ఖండిస్తూ రక్తదాన శిబిరం...

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

పాక్ ఉగ్రమూకల దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులైన బ్లాక్ డే సందర్భంగా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఆ వీరులను స్మరించుకుంటూ యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఎ.ఎస్ రాజు నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా తప్పనిసరిగా రక్తదానం చేయాలని, తెలియచేసారు. ఈ కార్యక్రమంలో యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ స్టేట్ కన్వీనర్ గవ్వల భారత్ కుమార్, హైదరాబాద్ కన్వీనర్ రుద్ర అభిరామ్ గౌడ్, కో కన్వీనర్ శివ గౌడ్, ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించగా నాయకులు, సంజీవ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, దొడ్ల రామ కృష్ణ గౌడ్, శివరాజు గౌడ్, పోశెట్టి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మానసికబలం భవిష్యత్తుకు సోపానం : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : మానవజీవితమే యాంత్రికంగా మారిన నేటి అధునాతన సాంకేతికయుగంలో ఎదురవుతున్న ఎన్నో సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి విద్యార్థుల్లో మానసికబలం ఎంతో అవసరమని, అదే వారి భవిష్యత్తుకు సోపానమని కేంద్ర గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రముఖ విద్యాసంస్థ స్మార్ట్‌జీనియస్ శనివారం రవీంద్రభారతి ప్రధానమందిరంలో నిర్వహించిన గ్లోబల్ లెవల్ కాంపిటీషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. స్మార్ట్‌జీనియస్ ప్రపంచవ్యాప్తంగా 12వేల యువమేధావులైన విద్యార్థులు ఒకేవేదికపై తమ ప్రతిభను ప్రదర్శించడానికి వేదికను అందించి పోటీలు నిర్వహించడం శ్లాఘనీయమన్నారు. ఈ పోటీలు విద్యార్థులో గణిత సామర్థ్యం, నైపుణ్యాన్ని వెలికితీయడమే కాకుండా వారిలో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొందించి అద్భుతమైన టెక్నాలజీ, అంతర్జాతీయస్థాయి ఎంటర్‌ప్రైజెస్ స్థాపించి భారతదేశ గౌరవాన్ని ఫరిడవిల్లింపజేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం దేశాభివృద్ధిలో సైన్స్, టెక్నాలజీ, డేటా, ఇన్నోవేషన్, మ్యాథమెటికల్ థింకింగ్ కీలకపాత్ర పోషిస్తున్నాయని, మానవ మనుగడకు పునాదిలా మారాయన్నారు. ప్రాచీనకాలం నుండి భారతదేశం గణితశాస్త్రంలో ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించిందని ఆయా మేధావులను ఉటంకిస్తూ గుర్తుచేశారు. ఈ సదస్సు ద్వారా కృత్రిమ మేధస్సు విప్లవంలో విద్యా, స్టెమ్ రంగాలకు ప్రాధాన్యతపై మేధావు చర్చిస్తారన్నారు. 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణంలో యువతే సారథులు... ఆత్మనిర్భరత, మౌళిక వసతుల అభివృద్ధి, సాంకేతికత, సుస్థిరత, సుపరిపాలన వంటి స్తంభాలపై వికసిత్ భారత నిర్మాణం ఆధారపడుతుందని, యువమేధావులు వికసిత భారత్ రథానికి సారథులవ్వాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. చివరిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒరాకిల్ ఇండియా సీనియర్ డైరెక్టర్ ఎం.రాజ్‌మోహన్, స్మార్ట్‌జీనియస్ వ్యవస్థాపక చైర్మన్ రాజలక్ష్మి రాజ్‌మోహన్ తదితర ప్రముఖులతో కలిసి విజేతలైన విదార్థులు అబాకస్, వేదగణితాలలో 1500 బహుమతులు, చేతివ్రాతలో 200మంది ఛాంపియన్లకు మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం పేరిట ఛాంపియన్లకు నగదు బహుమతులు అందజేసి శుభాభినందనలు తెలిపారు.

బహుమతి గ్రహీతలైన విద్యార్థులతో కిషన్‌రెడ్డి, రాజ్‌మోహన్, రాజలక్ష్మి తదితర అతిథులు

మున్సిపల్ ఎన్నికల్లో బిసి అభ్యర్థుల ఘన విజయం : గుజ్జ సత్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

రిజర్వేషన్లలో మోసం చేసినా మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల ఘన విజయం సాధించారని బిసి సంక్షేమ సంఘం పేర్కొంది. శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీసీ రిజర్వేషన్ బిల్లుపై రాజకీయ పార్టీల వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ఈ సమావేశానికి సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షత వహించి మాట్లాడుతూ 'బీసీ రిజర్వేషన్ బిల్లును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకొని, అమలు విషయంలో మాత్రం అన్ని పార్టీలు బీసీలను మోసం చేశాయి. ఎన్నో హామీలు ఇచ్చినా, అసలు బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు" అని మండిపడ్డారు. తాజా మున్సిపల్ ఎన్నికల్లో 116 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్లలో మొత్తం 2900 కు పైగా ఎన్నికలు జరిగిన వార్డుల్లో మెజారిటీ బీసీ అభ్యర్థులు విజయాలు సాధించారని తెలిపారు. ఇందులో ఎక్కువ భాగం జనరల్ సీట్లలోనే వచ్చాయన్నారు. ఈ ఎన్నికల్లో బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా చూసే రోజులు పోయాయి. ఇకపై మా హక్కులను విస్మరిస్తే ప్రజాస్వామ్య మార్గంలో మరిన్ని తీర్పులు ఇస్తాం" అని గుజ్జ సత్యం హెచ్చరించారు. బీసీ జేఏసీ కన్వీనర్ రాజునేత మాట్లాడుతూ "బీసీల ఓటు శక్తి ఎంత ప్రభావవంతమో ఈ ఎన్నికలు రుజువు చేశాయి. ఇకపై బీసీల హక్కులను విస్మరించే రాజకీయాలకు బీసీ సమాజం గట్టి సమాధానం ఇస్తుంది" అని హెచ్చరించారు. ఓబీసీ జాతీయ అధ్యక్షులు ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ ..ఈరోజు వచ్చిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 53పైగా బీసీ అభ్యర్థులు విజయం సాధించడం సాధారణ విషయం కాదు. ఇది బీసీ సమాజం ఇచ్చిన రాజకీయ తీర్పు. రిజర్వేషన్ లేకపోయినా, బీసీలు తమ శక్తిని ప్రజాస్వామ్య మార్గంలో నిరూపించుకున్నారు" అని అన్నారు. ఈ సమావేశంలో బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షులు ఐలయ్య గౌడ్, బీసీ జేఏసీ కన్వీనర్ రాజునేత, మనోజ్ కుమార్, జోగు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బిసి సంక్షేమ సంఘం సమావేశంలో పాల్గొన్న జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ తదితరులు

సైబర్ నేరగాళ్ల లింక్‌లు ఓపెన్ చేయొద్దు

-ఎస్‌హెచ్‌ఓ నాగేశ్వర్ రావు

అత్తాపూర్ ఫిబ్రవరి14,ప్రభాతవార్త : సైబర్ నేరాలపై ప్ర

మెరుగైన వైద్యానికి సిఎంఆర్ఎఫ్ ఎంతో మేలు : ఎమ్మెల్యే శ్రీగణేష్



మెరుగైన వైద్యానికి ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: పేద ప్రజలు అనారోగ్యంతో మృత్యువాత పడకుండా కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగై నవైద్యం చేయించుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతగానో ఉప యోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. బాలంరాయి ప్రాంతానికి చెందిన కళిక రాజు సతీమణి గీత అనారో గ్యంతో బాధపడుతుంది.నిమ్స్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకు నేందుకు రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు పత్రాన్ని శనివారం తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో గీతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు స్వర్ణ పాల్గొన్నారు.

మోండా డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటా

మీడియాతో మాట్లాడుతున్న మాజీ కార్పోరేటర్ కొంతం దీపిక

కంటోన్మెంట్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: మోండా డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశానని, తనకు పదవి ఉన్నా లేక పోయినా ఎల్ల ప్పుడు ప్రజా సేవలో ఉంటానని మోండా డివిజన్ తాజా మాజీ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. శనివారం మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 5 సంవత్సరాల పాటు మోండా డివిజన్ కార్పోరేటర్ గా విధులు నిర్వహించి డివిజన్ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పేద ప్రజలకు స్వయం ఉపాధి పథకం కింద ముద్రలోన్స్, బిసీ బంధు, మహిళలకు స్కిల్డ్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇప్పించి ఎంతో మందిని ప్రయోజకులుగా చేశామన్నారు. అదే విధంగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రతి ఏటా 220 మంది విద్యార్థులకు ఒక్కొ క్కరికి 3 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు ఇప్పించామన్నారు. కుమ్మరి గూడలో ధ్వంశం చేసిన అమ్మవారి విగ్రహం, ఆలయ పునర్ నిర్మా ణానికి ఎంతో కృషి చేశామన్నారు. అయోధ్యలోని రామ మందిర ఆలయానికి తన డివిజన్ నుంచి 200 మందిని తన సొంత డబ్బులతో పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్ళామన్నారు. తమకు సహాయ సహకారాలు అందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎన్.శ్రీగణేష్ లతో పాటు వివిధ విభాగాల అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలి పా రు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన దిశా కమిటీ మెంబర్ గా కొనసాగుతూ నప్రజలకు మరిన్ని సేవలు అందిస్తామన్నారు.

ఘనంగా కామన్ శిలాఫలకం ఓపెనింగ్

కామన్ శిలాఫలకాన్ని ఓపెనింగ్ చేస్తున్న దృశ్యం

నిజాంపేట్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో వెలిసినటువంటి శ్రీశ్రీశ్రీ ఉమా మహేశ్వర స్వామి, శ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవాలయం నందు కమాన్ ఓపెనింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి విచ్చేసి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డితో కలిసి కామన్ శిలాఫల కాన్ని ఓపెనింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పితాని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు సరళ లక్ష్మ ణ్, జనరల్ సెక్రెటరీ ముద్దికుప్పం కుమార్ రెడ్డి, ట్రెజరర్ వివి రమ ణ, జాయింట్ సెక్రెటరీ దశరథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల రామ కృష్ణ గుప్తా, ఎగ్జిక్యూటివ్ నెంబర్ సలాడి శివ, ఎగ్జిక్యూట్ నెంబర్, వై దాలి నాయుడు, ఎగ్జిక్యూట్ నెంబర్ ఎన్ బాలకృష్ణ, అంగ శ్రీని వాసరావు, ఏలూరి సత్య (నాని), బండ్ల విజయ్ కుమార్, లాలయ్య భక్తులు నిజాంపేట్ పెద్దలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మికతకు, సాంస్కృతిక విలువలకు కేంద్ర బిందువులు : ఎమ్మెల్యే కెపి వివేకానంద్

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జీడిమెట్ల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

ఆలయాలు ఆధ్యాత్మికతకు, సాంస్కృతిక విలువలకు కేంద్ర బిందు వులు అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం కుత్బుల్లా పూర్ నియోజకవర్గం 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ రామ సొసైటీ కాలనీలో గల కామాక్షి సామేత ఏకాంబర్ నాథ్ స్వామి ఆలయ 7వ వార్షికోత్సవంలో బిఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆల యాలు ఆధ్యాత్మికతకు, సాంస్కృతిక విలువలకు కేంద్రబిందువులని తెలిపారు. ఇలాంటి వార్షికోత్సవాలు సమాజంలో ఐక్యతను పెం పొందించి, భక్తి భావాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు. ఆల య కమిటీ సభ్యులు, భక్తులు ఎమ్మెల్యేని శాలువాతో సన్మా నించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజ న్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్ సీనియర్ నాయకులు బలరాం రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఇస్మాయిల్, గుబ్బాల లక్ష్మీ నారాయణ, ఆలయ కమి టీ సభ్యులు సత్యనారాయణ, నాయుడు, రవి, రాజా, బుజ్జి, భద్ర య్య, రాజు, దుబాయ్ శ్రీను, హరీష్, గిరి, 129 డివిజన్ అధ్యక్షు లు పుప్పాల భాస్కర్, సంపత్ మాధవ్ రెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధా కర్ గౌడ్, నరేందర్ రెడ్డి, మేడి చంద్ర శేఖర్, భక్తులు,పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు పెద్దపీట: ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

లలితా నగర్ కాలనీ లో విబ్సన్ ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రామచందర్ తన సొంత నిధుల తో ఏర్పాటు చేసిన సి.సి. కెమెరాలను సికింద్రాబాద్ శాసన సభ్య లు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ శనివారం ప్రా రంభించారు. కాలనీ వాసుల అభ్యర్థన మేరకు దాదాపు రూ. మూడు లక్షల ఖర్చుతో పద్మారావు గౌడ్ సూచనలకు అనుగుణంగా సుంకు రామచందర్ ఈ కెమెరాలను ప్రజోపయోగార్థం ఏర్పాటు చేశా రు.ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ప్రజల బ.్రద్రతకు, శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ విజయాలను గ్రేటర్ ఎన్నికల్లోనూ కొనసాగిస్తాం : మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ప్రభంజ నంను అంతే ప్రభంజనంతో త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సాధిస్తా మని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. శనివారం బాలానగర్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్లోని బూత్ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ ప్రతీ ఒక్క బూత్ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేసే విధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి కార్యకర్త తనకు అప్పజెప్పిన పనులను తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, కాంగ్రెస్ పార్టీ అభిమా నులను, సానుభూతి పరులను తక్షణమే గుర్తించి వివరా లను సేకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి మాట్లా డుతూ యుద్ధం జరుగుతున్న సమయంలో సైన్యంలో సైనికులు ఏవిధంగానైతే విరచిత పోరాటం చేస్తూ

కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న యుగంధర్ రెడ్డి

ముందుకు సాగుతారో అదే విధంగా కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలు కూడా అలాగే వీరోచితంగా కష్టపడా ల్సిన అవసరం ఉందన్నారు. కష్టపడితే విజయం తథ్యమని, ఇప్పటి నుండే కార్యాచరణను తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బంధిగా నరసింహ,మైనారిటీ నాయ కులు అడ్వకేట్ హుస్సేన్,ఆకుల నరేందర్ ముదిరాజ్, మట్టే ప్రసన్న కుమార్, ఓ బి సి నరేష్,మాదరీ శ్రీని వాస్, ముప్పురి బాలరాజు, సోనూ అర్షద్, గజానంద్ శేఖర్, జిల్లా శివ, ఇమ్రాన్, ముస్తఫా, సోహైల్, అక్రమ్, రుక్ముద్దీన్, జమ్మూ, శ్రీకాంత్, పీటర్, రాము, షేక్ సావుద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాతబస్తీలో వైభవంగా మహాశివరాత్రి మహోత్సవాలు

-ఘాన్సీబజార్‌లో ఏర్పాటు చేసిన 12 జ్యోతిర్లింగాల దివ్య దర్శన్

-శివరాత్రి సందర్భంగా కొనుగోలుదారులతో కిక్కిరిసి పోయిన మార్కెట్లు

చార్మినార్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : పాతనగరంలోని పలు ప్రాంతాలలో ఈ నెల 15వ తేదీన ఆత్యంత వైభ వంగా శివరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నా రు.ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ పాత బస్తీలోని శివాలయాలను అందంగా అలంకరించారు. హిందువులకు శివరాత్రి ముఖ్యమైన పండుగ.శివరాత్రి పర్వదినం రోజున భక్తులు ఉపవాసం పాటించి సాయం త్రం వేళల్లో దేవాలయాలకు వెళ్లి శ్రీపరమ శివునికి ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహిస్తారు.కాగా మహా శివరాత్రి సందర్భంగా చార్మినార్ సమీపంలోని చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో పలు భక్తి కార్యక్రమాలను ఏ ర్పాటు చేశారు.వేలాది మంది భక్తులు మందిరానికి పూజ లు నిర్వహింటానికి రానున్నందున మందిరం కమిటి ప్రతినిధి అజయ్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.భక్తులకు ఇరవై ఒక్క వేల రుద్రాక్షలు పంపిణీ చేయనున్నారు.రాత్రి మందిరంలో భజన కార్యక్ర మం ఉంటుంది.శివరాత్రి సందర్భంగా శివమందిరాన్ని అందంగా అలంకరించారు.

ఘాన్సీ బజార్‌లో 12 జ్యోతిర్లింగాల దివ్య దర్శన్

శివరాత్రి సందర్భంగా ఘాన్సీ బజార్‌లోని వైదిక వచనాల

చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరంలో ఏర్పాటు చేసిన శ్రీ పరమ శివుని చిత్రాలు

యంలో చేలాపుర బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో 12 జ్యోతిర్లింగాల ద్యివ దర్శన్‌ను ఏర్పాటు చేశారు.వైదిక వచనాలయంలో వరుసగా 12 జ్యోతిర్లింగాలను నెల కొల్పారు.14 నుంచి 16వ తేదీ వరకు 12 జ్యోతిర్లింగాల దివ్య ప్రదర్శన ఉంటుందని బ్రహ్మకుమారీలు తెలిపారు. పాతబస్తీలోని పురానాపూల్, చార్‌కమాన్, చేలాపుర, దూద్‌బౌలి,కామాటిపుర,కిషన్‌బాగ్‌తో పాటు పలు ప్రాం తాలలో ఉన్న శివాలయాలలో ఆదివారం ఎంతో వైభవం గా శ్రీ శివరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. కాగా శివరాత్రి సందర్భంగా పండ్లు,పువ్వుల ధరలు బాగా పెరిగాయి.పండ్ల ధరలు పెరిగి నప్పటికి ప్రజలు తమకు కావలసిన పండ్లు,పువ్వులు ఖరీదు చేశారు.పాతబస్తీలోని మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిసి పోయాయి.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ముందుకు రావాలి : సిఐ సైదులు

బాలంరాయిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న జనహిత సేవాట్రస్ట్

కంటోన్మెంట్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: మురికివాడల్లో నివాసం ఉంటున్న పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావా లని బేగంపేట ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. శనివారం జనహిత సేవా ట్రస్ట్, ఆశ్రిత రేయింబో ఓమ్స్ కమ్యూనిటీ కేర్, కిమ్స్ ఫౌండేషన్, భారత్ వికాస్ పరిషత్‌ల ఆధ్వ ర్యంలో శనివారం కంటోన్మెంట్ బాలంరాయిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 350 మంది రోగులకు ఉచితంగా మం దులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనహిత క్యాం ప్ కో ఆర్డినేటర్ నర్సింగ్ రావ్, ప్రతినిధులు క్రాంతి కిరణ్, ఆశ్రయ్, నవీన్,నాగరాజు, అనురాధ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడతాం

బస్తీలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బీజేపీ నేతలు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలపై పోరాడుతామని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిధులతో బౌద్ధ నగర్ డివిజన్‌ను అభివృద్ధి పదంలో ముందు ఉంచుతామని బీజేపీ డివిజన్ అధ్యక్షు డు సాయి ప్రసాద్ గౌడ్ తెలిపారు. సంజీవపురం అశోక్ నగర్ పార్సిగుట్ట పుల్లయ్య భావి బస్తీలలో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరూప గౌడ్ కార్పొరేటర్ గా ఉన్న సమయంలో బౌద్ధ నగర్ డివిజన్ 25 కోట్లతో అభివృద్ధి పథంలో ముందు ఉంచామని అన్నారు. అనంతరం బస్తీ వాసులతో కలిసి శ్రీనివాస్ నగర్ జలమండలి కార్యాలయానికి వెళ్లి సమస్యను ఏఈ ప్రియాంకకు వివరించారు. త్వరలోనే తాగునీటి, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ఆమే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జయంత్. దీపక్. రూప్ సాయి. రోహిత్. ప్రశాంత్. మహేష్. బస్తి మహిళలు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల జైలుశిక్ష

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

పోక్సో కేసులో ఓ నిందితుడికి న్యాయస్థానం మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన పోక్సో కేసులో ఈ తీర్పు వెలువడినట్లు నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బుల్‌జానీ తెలిపారు. నాగోల్ డివిజన్ జైపురి కాలనీ బీరప్ప దేవాలయము సమీపంలో నివాసం ఉండే పశు వుల అంకిత్ (23)అనే యువకుడు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించాడు. బాలికను వేధించిన సంఘట నకు సంబంధించి నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసును విచారిం చిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ న్యాయస్థానం పూర్తి ఆధారాలను పరిశీలించి నిందితుడికి మూడు సంవత్స రాల కఠిన కారాగార శిక్ష విధించడంతోపాటు అదనంగా రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. అదేవిధంగా బాధితురాలికి లక్ష రూపాయల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి పద్మావతి తీర్పు వెల్లడించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. పిల్లలపై లైంగిక వేధింపుల కేసుల్లో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల దీవెనలు మరువలేనిది

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.చిన్నారెడ్డి

బేగంపేట ఫిబ్రవరి 14,ప్రభాతవార్త

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజ నం సాగించిందని,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పటిష్ట వ్యూ హం,అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలతో భారీ విజయం సాధ్యం అయిందని సీఎం ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.చిన్నారెడ్డి ఒక ప్రకట నలో పేర్కొన్నారు.ప్రజలు అందించిన దీవెనలు మరువ లేవని,మున్సిపల్ ఎన్నికల ఫలితాలు మరింత బాధ్య తలు పెంచాయని,నూతన ఉత్సాహంతో ప్రజలకు మరింత సేవలు అందిస్తామని చిన్నారెడ్డి తెలిపారు. ము ఖ్యమంత్రి నాయకత్వంలో పార్టీ శ్రేణులు అందరూ కల్సి కట్టుగా చేసిన కృషి,ప్రజల ఆశీర్వాదాలతో కాంగ్రెస్ పార్టీ కి భారీ విజయం చేకూరిందని వివరించారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు హరీష్‌రావు,కేటీఆర్,బీజేపీ నాయకులు ఎన్నో కుట్రలు,తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు వాటి ని తిప్పికొట్టారని అన్నారు.ఇకనైనా బీఆర్ఎస్,బీజేపీ నా యకులు తప్పుడు ప్రచారాలు మానుకుని ప్రజల కోసం పనిచేయాలని ఆయన సూచించారు. వనపర్తి,పెబ్బేరు, మున్సిపల్ లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

జిహెచ్ఎంసి ఎన్నికలకు బిజెపి సిద్ధం

-బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతంరావు

సమావేశంలో మాట్లాడుతున్న ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్‌రావు, చిత్రంలో ఏడెల్లి అజయ్‌కుమార్, కన్నె రమేష్‌యాదవ్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

జిహెచ్ఎంసి ఎన్నికలు ఎప్పుడు జరిగినా భారతీయ జనతా పార్టీ సిద్ధంగా ఉందని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. శనివారం బర్కత్‌పురలోని బిజెపి నగర కార్యాలయంలో అంబ ర్‌పేట నియోజకవర్గం పోలింగ్ బూత్ కమిటీ సమావేశం జరిగింది.పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గౌతమ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది డివిజన్లను బిజెపి కైవసం చేసుకుంటుందన్నారు. అందుకు అన్ని పోలింగ్ బూత్‌లో కమిటీలను సన్నద్ధం చేయాలని పిలుపు నిచ్చారు. బూతులలో ఉన్నటువంటి అన్ని వర్గా లకు సంబంధించిన వారితో కలిసి నిర్మాణం చేసినప్పుడు పార్టీ శక్తివంతంగా తయారవుతుందన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని డివిజన్లో స్థానిక సమస్యల పైన అలు పెరుగని పోరాటం చేయాలని, స్థానికులను మమేకం చేస్తూ ఉద్యమాల్ని రూపకల్పన చేసుకుని ముందుకు పో వాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, ఎం.శ్యామ్‌రాజ్, కార్యదర్శులు ఎక్కాల కన్నా, మూల రవీందర్‌గౌడ్, నందకిషోర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఉమా రమేష్ యాదవ్,వన్నం రమేష్, డివిజన్ బిజెపి అధ్యక్షులు నరేష్‌గౌడ్, సుదగాని శ్రీధర్‌గౌడ్, పి.నాగరాజుచారి, జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసోజు నాగభూషణంచారి, కేబీ నర్సింగ్‌రావు, దామోదర్‌నాయుడు, షీర్‌సాగర్, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ బోర్‌వెల్స్‌కు విద్యుత్ సరఫరా చేయాలి : మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 1వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పవర్ బోర్‌వెల్స్ కు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయా ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన సొంత నిధుల తో విద్యుత్ సర్వీస్ వైర్ ఖర్చులు తానే భరిస్తానని తెలి పారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మంచినీటి సమస్య పరిష్కారానికి వాటర్ వర్క్సు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.

సంజీవరెడ్డి నగర్‌లో ఘనంగా కొలను లక్ష్మి బాల్ రెడ్డి సన్మాన సభ

సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: సంజీవరెడ్డి నగర్‌లో మాజీ కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్ రెడ్డి పదేళ్లు కార్పొరేటర్‌గా సేవలందించిన సందర్భంగా శనివారం 60 ఫీట్ రోడ్డులో అభిమానులు, ఆత్మీయుల ఆధ్వర్యంలో ఘన సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొలను లక్ష్మి బాల్ రెడ్డిని శాలువాలతో సత్కరించి, పూల బొకే అందజేసి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. ఆమె పదేళ్ల పదవీకాలంలో చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకుంటూ ప్రత్యేకంగా ప్రశంసించారు. అలాగే డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజన్ పరిధిలోని 32 బస్తీల నుంచి డివిజన్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు తదితరులు హాజరై మాజీ కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్ రెడ్డిని శాలువాలు, పూల బొకేలతో సత్కరించారు. ప్రజల హృదయాలు గెలుచుకున్న నాయకురాలు కొలను లక్ష్మి బాల్ రెడ్డి అని పేర్కొన్నారు. సనత్‌నగర్ డివిజన్ నుంచి రెండుసార్లు ప్రజల సంపూర్ణ మద్ద తుతో కార్పొరేటర్‌గా ఎన్నికై, ప్రజా సమస్యలను వినిపిం

చుకొని వాటిని పరిష్కరించడంలో ఆమె ముందుండేవారని తెలిపారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చొరవతో గత పదేళ్లలో రూ.150 నుండి రూ.200 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్ర మంలో మాజీ కార్పొరేటర్ నామాన శేషు కుమారి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేష్ గౌడ్, మీర్జా ఖలీల్ బేగ్, కొలను భూపాల్ రెడ్డి, మల్లారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, శ్రీహ రి, ఆకుల హరి, నరేందర్, కిషోర్, నాగేంద్రమ్మ, పద్మ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన అప్రమత్తత అవసరం

- అదనపు సిపి శ్రీనివాసులు

బాంధ్రాయణగుట్ట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త : సైబర్ నేరాల నిరోధానికి అవగాహ న ఒక్కటే మార్గమని నగర అదన పు సీపీ (క్రైమ్) ఎం.శ్రీనివాసులు తెలిపారు. ప్రతి ఒక్కరు సైబర్ మోసగాళ్ళ వలలో పడకుండా అప్ర మత్తతో మెలగాలని సూచించారు. చార్మినార్ జోన్‌లోని ఛత్రినాక పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.ఎన్.

సైబర్ నేరాల గురించి వివరిస్తున్న నగర అదనపు సీపీ శ్రీనివాసులు

ప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో శనివారం రాజన్నబావి రెడ్డి జన సంఘంలో నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అద నపు సీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రకరకాల మోసాలకు పాల్ప డుతున్నారని, ఓటీపీలు, లింకులు, మేసేజ్‌లు, ట్రేడింగ్, ఆధార్, ఏపీకే ఫైల్స్, ట్రాఫిక్ ఛాలానాలు తదితర సందేశాలను పంపించి తమ బ్యాంక్ అకౌంట్లలోని నగదును ఊడ్చే స్తున్నారని వివరించారు. వెంటనే మోసాన్ని పసిగట్టాలన్నారు. సైబర్ వలలో చిక్కితే వెంటనే సీ మిత్ర, టోల్ ఫ్రీ నెంబర్ 1930లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మీ డేటా...మీ బాధ్యత అన్నారు. చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ప్రభాకర్ ఖరే, సైబర్ క్రైమ్ డీసీపీ వి.అరవింద్ బాబులు సైతం సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. అనం తరం సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తతో మెలుగుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఛత్రినాక ఏసీపీ సిహెచ్.చంద్రశేఖర్, చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్, ఛత్రినాక ఇన్‌స్పె క్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ వర్మ, శాలిబండ ఇన్‌స్పెక్టర్ పి.మహేష్ గౌడ్, మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ సి.శీను, ఛత్రినాక ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్.మోహన్‌రావు, కేంద్ర శాంతి సంఘం అధ్యక్షులు శ్రీకృష్

ప్రజల సంక్షేమం కోసం కృషి : ఎమ్మెల్యే బలాల

ఎమ్మెల్యే బలాలను సన్మానిస్తున్న నాయకులు మతీన్ తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని మలక్ పేట్ నియోజకవర్గ6 ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో పలు ప్రాంతాలలో ఎంఐఎం అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో మలక్ పేట ఎంఐఎం నాయకులు మతిన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అహ్మద్ బలాలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛలనుఅందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతినిత్యం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో పర్యటిస్తూ స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. నాయకులు మతీన్ మాట్లాడుతూ ఎంఐఎం తోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏపీఏయూ కాలనీ కమ్యూనిటీ హాల్ లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు మడిగల విజయభాస్కర్ రెడ్డి, వైద్యులు తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆస్మాన్ ఘాడ్ డివిజన్ ఏపీఎయు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మడిగల విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీఏయు కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ లో మడిగల విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్, నాచురోపతి సంస్థ సహకారంతో ఉచిత ఆక్యుపంక్చర్, నాచురోపతి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్యుపంక్చర్, నాచురోపతి వైద్య విధానం ఎంతో సురక్షితమైన సహజసిద్ధమైనదని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నరని వివరించారు. ఈ కార్యక్ర మంలో సుభాష్ గౌడ్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

కార్మికుల కోసం లేబర్ కార్డు నమోదు శిబిరం

నేరేడ్ మెట్, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త : డివిజన్ పరిధిలో కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన లేబర్ కార్డు అప్లికేషన్ శిబిరాన్ని బీఆర్ఎస్ నాయకుడు బద్దం హేమంత్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించి, కార్మికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హేమంత్ రెడ్డి మాట్లాడుతూ, డివిజన్‌లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు లేబర్ కార్డు పొందడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందగలరని తెలిపారు. నిర్మాణ కార్మికులు సహా వివిధ రంగాలలో శ్రమిస్తున్న కార్మికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమమే పార్టీ లక్ష్యమని, వారికి అవసరమైన సహాయ సహకారాలు ఎప్పటికప్పుడు అందిస్తామని హామీ ఇచ్చారు. శిబిరం నిర్వహణలో డివిజన్ అధ్యక్షులు సూరి, నాయకులు వడ్డెర్ రాజు, సహా పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్మికులకు దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన పత్రాలు, నమోదు విధానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శిబిరానికి మంచి స్పందన లభించగా, పలువురు కార్మికులు అదే రోజు దరఖాస్తులు సమర్పించారు. ఇటువంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కార్మికులు కోరారు.

నీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపిన కొప్పు

నగదును అందిస్తున్న నర్సింహారెడ్డి

హయత్ నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: లెక్చరర్స్ కాలనీ డివిజన్ వీరన్నగుట్ట భస్తి దవాఖనలో పవర్ బోర్ పాడైన విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి 7 వేల రూపాయల స్వంత ఖర్చుతో రిపేర్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరన్నగుట్ట ప్రాంతంలోని 8 బోర్లు తరుచు మరమ్మతులకు గురికావడం... జీహెచ్ఎంసీ, జలమండలి మధ్య సమన్వయ లోపంతో కాలనీ వాసులు రిపేర్ చేయించు కోవడం జరుగుతోం దన్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. తాను మంజూరు చేయించిన పనులను ఆరు నెలల్లో పూర్తి చేసేలా పర్య వేక్షస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతి నిధులు డా.నరసింహా, కోటయ్య ముదిరాజ్, రవి, రమేష్ చారి, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు మల్లాపూర్‌లో ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ సమీపంలోని మల్లాపూర్ ఆర్‌సిఐ రోడ్డులోనున్న వైఎఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించనున్నారు. టిపిసిసి కార్యదర్శి, సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. శ్రీ యెల్మేటి రాంరెడ్డి మెమోరియల్ పేరిట ఓపెన్ బాడీ బిల్డింగ్ అండ్ మెన్స్ ఫిజిక్ ఛాంపియన్ షిప్ (దేహదారుఢ్య) పోటీలను అదే విధంగా మిష్టర్ తెలంగాణ ఐకాన్ క్లాసిక్-2026 (సీనియర్ మరియు జూనియర్) పోటీలను నిర్వహించనున్నారు. తెలంఆణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సహకారంతో యెల్మేటి అమరేందర్‌రెడ్డి నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో వివిధ ప్రాంతాలను నుండి పేరున్న బాడీ బిల్డర్లు పాల్గొననున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

మలక్ పేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని టీపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్, హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి లు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో ముసారాం బాగ్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద వారి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో ప్రజల తీర్పు రాష్ట్రంలో రెండు సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజాపాలనకు సంపూర్ణ మద్దతు అని పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చైర్మన్ చెకొలేకర్ లక్ష్మి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రత్యూష, కిషన్ సింగ్ , షకీల్ తదితరులు

గ్రేటర్ లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రత్యూష, కిషన్ సింగ్, మహమ్మద్ షకీల్, డివిజన్ అధ్యక్షులు లింగాల శ్రీనివాస్ గౌడ్, రాహుల్ సింగ్, చక్రపాణి నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు

తుర్కయంజాల్‌ను ఓల్డ్ సిటీతో కలపొద్దు : నరసింహ రెడ్డి

తుర్కయంజాల్ ఫిబ్రవరి14,ప్రభాతవార్త అభివృద్ధి, ఆర్థిక ఆదాయం ఉన్న ప్రాంతాలను ఓల్డ్ సిటీలో కలిపి సీఎం రేవంత్ రెడ్డి ఓవైసీకి తాకట్టు పెడుతున్నారని తుర్కయంజాల్ అధ్యక్షులు బీజేపీ ఎలిమినేటి నరసింహా రెడ్డి అన్నారు. ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని రాగన్నగూడలోని బీజెపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలిమినేటి నరసింహా రెడ్డి మాట్లాడుతూ 150 డివిజన్లతో చేసిన కొత్త జిహెచ్ఎంసిలో హిందువులకు తీవ్రని అన్యాయం జరుగుతుందన్నారు. ముస్లిం ప్రాంతాల్లో ఉన్న డివిజన్లు కేవలం 15 నుంచి 20 వేల ఓట్లకు ఒక డివిజన్ చేశారని, అత్యధికంగా ఉన్న హిందూ ప్రాంతాల్లో 50 నుంచి 70 వేలకు డివిజన్లు చేయడం ఏదైతే ఉందో హిందువుల ప్రాతినిధ్యం తగ్గించడానికి ఓవైసీ తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. ఆర్థిక ఆదాయం ఉన్న ప్రాంతాలను తీసుకుపోయి సీఎం రేవంత్ రెడ్డి తమ రాజకీయ స్వలాభం కోసం ఓవైసీ కి తాకట్టు పెడుతున్నారన్నారు. తక్షణమే పరిసర ప్రాంతాలైన

తుర్కయంజాల్, బడంపేట్, మీర్పేట్, తుక్కుగూడ, శంషాబాద్ ప్రాంతాలతో కలిపి కొత్త కార్పొరేషన్ గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా భారత రాజకీయంలో అత్యంత ప్రభావంతమైన మహిళ నాయకురాలు సుష్మా స్వరాజ్ జయంతి వేడుకలు ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొత్త రామ్ రెడ్డి, బచిగళ్ల రమేష్, కొండ్రు పురుషోత్తం, కరాడి అనిల్, కొలను రవీందర్ రెడ్డి, నందగిరి సురేష్, దార వెంకటేష్, అరాని నాగరాజు, కాంచనేని దాసు, సురేష్ సాగర్, జ్ఞానేశ్వర్ చారి, మదన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కర్మన్‌ఘాట్ హనూమాన్ దేవాలయంలో పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం

సైదాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: స్వయంభు శ్రీ కర్మన్ ఘాట్ హనూమాన్ దేవాలయ ప్రాంగణంలోని శ్రీ నాగేశ్వర, శ్రీ స్ఫటిక లింగేశ్వర, శ్రీ విశ్వనాథ స్వామి దేవాలయాలను మహాశివరాత్రి పర్వదినానికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఉదయం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక రుద్రాభిషేకాలు, ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు రుద్రహోమము, రాత్రి 7 గంటలకు పల్లకి సేవ, రాత్రి 10.30కు మహాన్యాసము, రాత్రి 12 గంటలకు లింగోద్భవకాల అభిషేకము, రాత్రి 1.30కు పార్వతి పరమేశ్వరుల కళ్యాణం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కార్యనిర్వాహణాధికారి లావణ్య తెలిపారు.

శ్రీ భవాని సమేత నాగలింగేశ్వర స్వామి దేవాలయంలో.... కర్మన్‌ఘాట్‌లోని శ్రీ భవాని సమేత నాగలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం ఏకవార రుద్రాభిషేకం, అనంతరం భక్తులచే విశేష రుద్రాభిషేకాలు నిర్వహించబడుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు అలంకరణ, మహా నైవేద్యం, హారతి, అర్చనలు ఉంటాయి. రాత్రి 10 గంటలకు శ్రీ భవాని సమేత నాగలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. రాత్రి 11.30 నుండి లింగోద్భవ కాలం వరకు ఏకాదశ రుద్రాభిషేకం, అలంకరణ, మహా హారతి నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని చైర్మన్ కొరిపల్లి లక్ష్మయ్య, వైస్ చైర్మన్ కోయిలకొండ సుధాకర్, పెంట్‌రాజ్, కోశాధికారి పురుషోత్తం, వసంత్‌కుమార్‌లు కోరారు.

కర్మన్‌ఘాట్ హనూమాన్ దేవాలయం

నాదర్‌గుల్, బడంగ్‌పేట్ డివిజన్లలో కెఎల్ఆర్ క్షేత్రస్థాయి పర్యటన

-నాలా ఆక్రమణలు, ప్రభుత్వ భూములను పరిశీలన
-గ్రీన్‌హోమ్స్‌లో పూడ్చివేతకు గురైన నాలాను పునరుద్ధరించాలని ఆదేశం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ బడంగ్‌పేట్ సర్కిల్‌లోని నాదర్‌గుల్ గ్రీన్‌హోమ్స్ కాలనీలో పూడ్చివేతకు గురై రోడ్డుగా మారిన వరద నీటి నాలాను పునరుద్ధరించాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ఆయన మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కందాడి శ్రీరాంరెడ్డి, సీనియర్ నాయకులు పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, పుట్టగళ్ళ జగన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్ తదితరులతో కలిసి బడంగ్‌పేట్, నాదర్‌గుల్ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా 61 డివిజన్ బడంగ్‌పేట్ కిందకు వచ్చే గ్రీన్‌హోమ్స్ కాలనీలో అక్రమంగా పూడ్చివేయబడిన నాలాను, దానిపై నిర్మించిన రోడ్డును గమనించిన ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు నాయకులు ఆయనకు నాలా కబ్జా, భరాతః వర్షాల సమయంలో కాలనీ ముంపు సమస్య గురించి వివరించారు. ఈ మేరకు స్పందించిన ఆయన తక్షణమే బడంగ్‌పేట్ డిసితో మాట్లాడి నాలాను పునరుద్ధరించి నిధులు కేటాయించి గ్రీన్‌హోమ్స్ కాలనీ నుండి పోస్టల్ కాలనీ వరకు నాలాను విస్తరించాలని ఆదేశించారు. అంతకు ముందు నాదర్‌గుల్ డివిజన్ 57 కిందకు వచ్చే నాదర్‌గుల్ సాయిబాబా ఆలయ సమీపంలోనున్న సుమారు 7.03 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అందులో ప్రభుత్వ భవనాలు, ప్రజలకు ఉపయోగపడే భవనాలు నిర్మించడానికి అనువుగా ఉన్నందున అధికారులకు సూచనలు చేశారు. అనంతరం నాదర్‌గుల్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడారు.

నాలాలు, ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న కెఎల్ఆర్‌కు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాతృదేవోభవ ఆశ్రమానికి రూ.10లక్షలు విరాళం అందజేత కాగా తన పర్యటనలో భాగంగా కెఎల్ఆర్ నాదర్‌గుల్‌లో నూతనంగా నిర్మిస్తున్న మాతృదేవోభవ అనాథాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అనాథలు, ఆభాగ్యులకు ఆశ్రమం తరపున అందుతున్న సేవలను గుర్తించిన ఆయన నిర్వాహకునికి రూ.10 లక్షలను నిర్మాణం కోసం తన వంతుగా విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో గడ్డిఅన్నారం మార్కెట్ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, డివిజన్ల నాయకులు బంగారి అశోక్, అంకంగారి వెంకటేశ్‌గౌడ్, భీమిడి చంద్రపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చిన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కుమార్ యాదవ్, యాతం సాయిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణోత్సవం

రామంతాపూర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : పాత రామంతాపూర్‌లోని పురాతన శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం శివ పార్వతి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కొండూరి సురేంద్ర, అర్చకులు మోత్కూరి శేఖర్‌బాబు శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో పలువురు ఆలయ కమిటి సభ్యులు, పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతిపూజ, అంకురార్పణం, శుక్రవారం సంతోషిమాత షట్ వింశతి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. శనివారం శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, ఆలయ చైర్మన్ శగా శ్రీధర్, మాజీ చైర్మన్ నామ్ రాజి రెడ్డి, ధర్మకర్తలు కృష్ణ, చంద్ర శేఖర్, అరుణ్ సాయి, మీటు గౌడ్, జంగయ్య, శోభ, రవి, కాంగ్రెస్ పార్టీ నేతలు జంగయ్య, బాబు రావు, సంతోష్, జి భాస్కర్, సందీప్, భాస్కర్, బుల్లెట్, అశోక్, రాజు, రవి, కన్నా యాదవ్, మల్లేష్, నరేష్, అనిల్ యాదవ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రుద్రాభిషేకం నిర్వహిస్తామని ఆలయ కమిటి నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

రామంతాపూర్ శివాలయంలో శివపార్వతుల కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటి నేతలు

22న వనితా శంఖారావం

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: ఈనెల 22వ తేదీన సికింద్రాబాద్లోని ప్యారడైజ్ వద్ద నిర్వహించే శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నిర్వాహకులు శనివారం కొత్తపేట డివిజన్ బిజెపి కార్యాలయంలో పవన్‌కుమార్‌కు వనితా శంఖారావం ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరుకావాలని బిజెపి మహిళా మోర్చా నాయకురాలు పోరెడ్డి కవితరెడ్డి బృందం ఆహ్వానం పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మణిద్విపవర్ణన, శివసహస్రనామ పారాయణం, భగవద్గీత(40శ్లోకాలు), పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, ధర్మ శిరోమణి అవార్డు కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వగ్గల సత్యనారాయణ, సాయిపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

న్యాయవాదుల వరుస హత్యలు తీవ్ర ఆందోళనకరం

: హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదులు వరుస హత్యలకు గురవుతుండటం తీవ్ర ఆందోళనకరమని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ తన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శనివారం అత్తాపూర్ లో తన కార్యాలయంలో విధుల్లో ఉన్న న్యాయవాది ఖదీర్ దారుణ హత్యకు గురికావడం తనను కలచి వేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డిఅన్నారం కళ్యాణ్ నగర్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాపోలు భాస్కర్ మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితమే జరిగిన యువ మహిళా న్యాయవాది స్వప్న హత్యోదాంతాన్ని మరువక ముందే మరో న్యాయవాది ఖదీర్ హత్యకు గురికావడం విచారకరమన్నారు. తెలంగాణలో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని తాము ఎంతో కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో న్యాయవాదుల సంరక్షణ, భద్రతలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని ఆయన కోరారు.

స్మశాన వాటిక అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం

: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నేరేడ్ మెట్, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త: ఓల్డ్ నేరెడ్మెట్ గౌడ సంఘం స్మశాన వాటిక అభివృద్ధి అంశంపై స్పందిస్తూ మర్రి రాజశేఖర్ రెడ్డి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శనివారం మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ సహకారం తో ఓల్డ్ నేరేడ్ మెట్ వాసులు స్మశాన వాటికలో ప్రహరీ గోడ నిర్మాణం, షెడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, అంతర్గత రహదారుల అభివృద్ధి వంటి పనులను గూర్చి ఎమ్మెల్యే కు వివరించారు. ఈ ఈ సందర్భంగా స్పందించే ఎమ్మెల్యే దశలవారీగా స్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అవసరమైన నిధుల కేటాయింపుకు సంబంధిత అధికారులతో చర్చించి, త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గౌడ సంఘం ప్రతినిధులు సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా అమలు దిశగా అడుగులు వేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈశ్వర్ గౌడ్, నరేందర్ గౌడ్, నర్సింహ గౌడ్, అభిషేక్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, పవన్ గౌడ్, విశ్వనాథ్ గౌడ్, జగదీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు జనార్దన్, నవీన్ పాల్గొన్నారు.

సమిష్టిగా మహిళా సంక్షేమానికి కృషి చేయాలి

అన్నపూర్ణమ్మను సన్మానిస్తున్న మధురఉపేందర్ రెడ్డి

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: మహిళలందరూ సమన్వయంతో పని చేస్తూ మహిళా సంక్షేమానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ శ్రీరామ కృష్ణాపురం కాలనీలో నూతనంగా ఎన్నికైన మహిళా సంఘం కార్యవర్గ సబ్యులు వాసవికాలనీలోని మధురఉపేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు యద్దనపూడి అన్నపూర్ణమ్మ, సబ్యులకు జ్ఞాపికను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఇఎస్ సొసైటీ అధ్యక్షులు రాజేశ్రీరామారావు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు ఓరుగంటి కృష్ణవేణి (రాధ), కార్యదర్శి గుంటూరు శకుంతల, ప్రధానకార్యదర్శి మాధవికులకర్ణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సరిత, కోశాధికారి కొండపల్లి రాణి, కార్యవర్గ సబ్యులు జ్యోతి, సుజాత, శ్రీవాణి, పద్మ, సురేఖ, ఉషరాణి, స్వప్న,మౌనిక,శ్రీకళ పాల్గొన్నారు.

నేడు మహాశివరాత్రి లక్ష రుద్రాక్ష ధారక శివలింగాభిషేక మహోత్సవం

నాణ్యాలతో తులాభారం ఏర్పాటుచేసిన దృశ్యం

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తపేట చౌరస్తా భవాని క్రాస్‌రోడ్ వద్ద ఉన్న శ్రీభవాని మందిరంలో మహాశివరాత్రి లక్ష రుద్రాక్ష దారుక శివలింగాభిషేక మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయం చైర్మన్ భావనాబుషి, వైస్ చైర్మన్ వీరమల్ల కాటంరాజు తెలిపారు. రూపాయి నాణ్యాలు, రుద్రాక్షలతో తులాభారం అభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆదివారం రాత్రి లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకములు, స్వామివారికి విశేషాలంకరణ, మహా నైవేద్యము, శివలింగాలకు విశేష అభిషేకాలు తదితర ప్రత్యేక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. భక్తులకు నరదిష్టి నివారణకై రుద్రాక్ష రక్షణగా హోమం చేసిన రుద్రాక్షలు, తులాభారం నాణ్యాలు ప్రసాదంగా పంపిణీ చేస్తామని భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు విజ్ఞప